# స్క్రూటినీ ప్రక్రియ పూర్తి

**నిజామాబాద్‌లో 26, కామారెడ్డిలో 12 మంది అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ**

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 13 : నిజామాబాద్ జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో దాఖలైన నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియ సోమవారం నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. 26 మంది అభ్యర్థులు దాఖలు చేసిన అన్ని సెట్ల నామినేషన్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయని వెల్లడించారు. ఆరు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 128 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయగా.. స్క్రూటినీలో 26 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. 102 మంది అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే చెల్లుబాటు అయ్యాయని స్పష్టంచేశారు. ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 21 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు కాగా.. ఐదుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని పేర్కొన్నారు. బోధన్ నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు కాగా.. 8 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని వివరించారు. బాన్సువాడ సెగ్మెంట్‌లో 17 మంది అభ్యర్థులవి చెల్లుబాటు కాగా.. ఇద్దరు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని, నిజామాబాద్ అర్బన్ సెగ్మెంట్‌లో 23 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు కాగా.. 8 మంది అభ్యర్థులవి తిరస్కరణకు గురయ్యాయని, రూరల్ నియోజకవర్గంలో 17 మంది అభ్యర్థుల నామపత్రాలు చెల్లుబాటు కాగా.. ఒకరి నామినేషన్ తిరస్కరణకు గురైనట్లు వివరించారు. బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గంలో 9 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు అయ్యాయని, ఇద్దరు అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు.

**కామారెడ్డి జిల్లాలో 12 నామినేషన్ల తిరస్కరణ**

కామారెడ్డి, నవంబర్ 13 : కామారెడ్డి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో మొత్తంగా 95 నామినేషన్లు వేయగా.. 12 నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గంలో 58 నామినేషన్లు వేయగా ఆరు రిజెక్ట్ అయ్యాయని తెలిపారు. జుక్కల్‌లో 23 నామినేషన్లు వేయగా.. నాలుగు, ఎల్లారెడ్డిలో 14 నామినేషన్లు వేయగా.. రెండు రిజెక్ట్ అయ్యాయని వివరించారు.

**బాన్సువాడలో 2 నామినేషన్లు..**

బాన్సువాడ, నవంబర్ 13 : నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలో 19 నామినేషన్లకు గాను రెండు రిజెక్ట్ అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి భుజంగరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# బాజిరెడ్డి జగన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరిక



ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాలూర్ గ్రామస్తులు

నిజామాబాద్ రూరల్/ డిచ్‌పల్లి/ ధర్పల్లి, నవంబర్ 13 : ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ ఆధ్వర్యంలో వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన పలువురు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. రూరల్ మండలంలోని కాలూర్‌లో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు సుదర్శన్‌రెడ్డి, సందీప్‌తో పాటు 200 మంది ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నుడా డైరెక్టర్ ముస్కె సంతోష్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కోర్వ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ నారాయణ, నాయకులు ప్రవీణ్, రాజు, శ్రీను పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని అమృతాపూర్ గ్రామానికి చెందిన సుమారు 50 మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు శక్కరికొండ కృష్ణ, దాసరి లక్ష్మీ నర్సయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దండు గుల సాయిలు, నయీం, సాయినాథ్, గిరి, అమీర్, రామరాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి మండలకేంద్రంలోని పెద్దమ్మ ఆలయ ప్రాంగణంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మచ్చ రఘురాం సుమారు వంద మంది యువకులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి బాజిరెడ్డి జగన్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి జగన్ మాట్లాడుతూ.. బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేయాలని, బీఆర్‌ఎస్ పార్టీ పనిచేసిన కార్యకర్తలను తప్పక గుర్తిస్తుందని అన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు, మండల కన్వీనర్ పీసు రాజ్‌పాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నల్ల హన్మంత్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం సిరికొండ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు గంగాదాస్, లొక్కిడి సంతోష్, సాయిలు, చంద్రకాంత్, ముదిరాజ్ సభ్యులు పాల్గొన్నారు.

# గువ్వల బాలరాజుపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

■ జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీచైర్మన్ విఠల్‌రావు

ఖలీల్‌వాడి, నవంబర్ 13 : అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శనివారం చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. నగరంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోనే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భౌతికదాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దాడులకు పాల్పడిన వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఏటీఎస్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు ఎం.రాజేశ్వర్, డాక్టర్ తెలంగాణ శంకర్, శేఖర్, రాజు పాల్గొన్నారు.

## నేడు లక్ష దీపోత్సవం

ఖలీల్‌వాడి, నవంబర్ 13 : కార్తీక మాసం సందర్భంగా నగరంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో భారత జాగృతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నేడు లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జాగృతి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ భరద్వాజ్, సభ్యుడు సందీప్, ఆలయ కమిటీ చైర్మన్ బిల్లా మహేశ్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## వేములకే మా మద్దతు



వడ్యాట్‌లో బీఆర్‌ఎస్ నాయకులకు తీర్మానపత్రాన్ని అందజేస్తున్న వృద్ధసంఘం, గోసంగి సంఘం సభ్యులు

మోర్తాడ్, నవంబర్ 13: మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతు తెలుపుతూ మండలంలోని వడ్యాట్ గ్రామంలోని వృద్ధసంఘం, గోసంగి సంఘ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ మేరకు తీర్మాన కాపీని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు గంధం మహిపాల్, వెల్మ రవీందర్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వడ్యాట్ గ్రామంలో ఇప్పటివరకు ఏ నాయకుడు చేయని అభివృద్ధి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేశారని తెలిపారు. కార్యక్రమంలో మహేశ్, నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగుల సంబురం

**ఊరూరా ఘనంగా దీపావళి వేడుకలు**



నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 13 : దీపావళి సంబురాలు జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటాయి. ఆదివారం ఉదయం నుంచే ఇండ్లను పూలు, మామిడితోరణాలు, అరటి కొమ్మలతో ఇండ్లు, వ్యాపార సముదాయాలను అలంకరించారు. నూతన వస్త్రాలు ధరించి సాయంత్రం ఇండ్ల ముంగిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసి పూలతో తీర్చిదిద్దారు. సాయంత్రం లక్ష్మీదేవి చిత్రపటాలను పెట్టి, పూజలు చేసి ప్రసాదాలు, స్వీట్లు పంపిణీ చేశారు. యువతీ యువకులు, చిన్నారులు బాణాసంచా కాలుస్తూ కేరింతలు కొడుతూ సందడి చేశారు. దీపావళి కాంతులతో అమావాస్య రోజు పౌర్ణమి వెలుగులు విరజిమ్మాయి.

# మహిళా సర్పంచును దూషించడం సరికాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల నాయకులు

జక్రాన్‌పల్లి, నవంబర్ 13 : కాంగ్రెస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి భూపతిరెడ్డి శనివారం నిర్వహించిన ప్రచారంలో భాగంగా మండలంలోని చింతలూరు సర్పంచ్ సుకన్యను దూషించడం సరికాదని జడ్పీటీసీ సభ్యురాలు తనూజా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆమె ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మహిళా ప్రజాప్రతినిధిని దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక లోపంతోనే కరెంట్ సరఫరా నిలిచిపోయిందని, ఇందులో సర్పంచ్ ప్రమేయం ఏమీ లేదని తెలిపారు. వారు ప్రచారానికి వస్తే కరెంట్ సరఫరా నిలిపివేయించే దుర్బుద్ధి తమకు లేదని అన్నారు.

**పార్టీలు మారే నాయకులను ప్రజలు నమ్మరు..**

పూటపూటకు పార్టీలు మారే నాయకులను ప్రజలు నమ్మరని జక్రాన్‌పల్లి ఎంపీపీ కుంచాల విమలారాజు, బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. మండలానికి చెందిన పలువురు నాయకులు పూటపూటకు పార్టీలు మారుతున్నారని, వారిని ప్రజలు నమ్మబోరని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తోపాటు చింతలూరు సర్పంచ్ సుకన్యను దూషించడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే భూపతిరెడ్డి గ్రామాల్లోకి వస్తారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. బాజిరెడ్డి గోవర్ధన్ రూరల్ నియోజకవర్గం, మండలాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. సమావేశంలో జడ్పీటీసీ తనూజా శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ముస్కు తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న, మండల కో-ఆప్షన్ సభ్యుడు అక్బర్‌ఖాన్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ డీకొండ శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మైదం రాజన్న, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

## వేముల గెలుపు కోరుతూ వేములవాడకు పాదయాత్ర



భీమ్‌గల్ నుంచి వేములవాడకు తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

భీమ్‌గల్, నవంబర్ 13: బాల్కొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని గోన్‌గొప్పుల గ్రామం నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు వేములవాడకు పాదయాత్రగా సోమవారం తరలివెళ్లారు. గ్రామంలోని బీఆర్‌ఎస్ కార్యకర్తలు రవి, రేగుళ్ల గంగాధర్ (ఖార్కాన) గోన్‌గొప్పులలోని హరిహర క్షేత్రం నుంచి వేముల రాజన్నస్వామి ఆలయం, నాంపల్లిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వరకు పాదయాత్రగా తరలివెళ్లగా.. స్థానిక నాయకులు అభినందించారు.